ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 23 అక్టోబరు 2025

# ఎడతెగని వర్షం


జలదిగ్బంధమైన ఎన్జీవో కాలనీ

- దెబ్బతిన్న పంటలు ● అధికారుల అంచనా మేరకు 2296 హెక్టార్లలో పంటనష్టం
- అనధికారికంగా ఐదు వేల హెక్టార్ల పైమాటే..
- కడపలో వీధులు జలమయం ● అత్యధికంగా కాశినాయనలో 41.6 మి.మీ నమోదు
- అత్యల్పంగా వేములలో 6.2 మి.మీ నమోదు ● జిల్లా సగటు వర్షపాతం 17.1 మి.మీ
- నేడు పాఠశాలలకు సెలవు


ఖాజీపేట మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న రైతులు


అట్లూరు మండలం సగిలేరు వంతెనపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు


పోరుమామిళ్ల మండలం ముద్దంవారిపల్లెలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


చెన్నూరు మండలం గుర్రంపాడులో వర్షాలకు నేలవాలిన వరి

(కడప-ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో ఎడతెగని వర్షం కురిసింది. మంగళవారం వేకువజాము నుంచి మొదలైన వర్షం అడపా దడపా ఎలిపిరినిస్తూ కురుస్తూ వచ్చింది. ఇక అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కురిసింది. తిరిగి 4గంటలకు మొదలైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. జోరువాన వల్ల పంటలు దెబ్బతిన్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో సాగు చేసిన వరిపైరు ఇప్పుడు కోత దశకు వచ్చింది. వర్షం కారణంగా రైతులు వరిపంట కోతలు చేపట్టలేదు. దీంతో వరిపైరు నేలకొరిగింది. ఇక కంది, మినుము, వేరుశెనగ, పత్తి, మొక్కజొన్న ఇతర పంటలు 15 మండలాల్లో 2,296 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగ అంచనా వేశారు. అయితే నష్టం సుమారు 5వేల హెక్టార్లల్లో సంభవించినట్లు రైతులు చెబుతున్నారు. జిల్లా సరాసరి వర్షపాతం 17.1 మి.మీ నమోదయింది. ఇక అత్యధికంగా కాశినాయన మండలంలో 41.6 మిమీ వర్షపాతం నమోదైంది. ఆ తరువాత బి.కోడూరులో 29.2, చెన్నూరు 28.8, వల్లూరులో 28.4 మి.మీగా నమోదైంది. అత్యల్పంగా వేములలో 6.2 మిమీ నమోదు కాగా కడపలో 6.4, మైలవరం 6.6మి.మీ వర్షం కురిసింది. ఇక తుఫాను కారణంగా కలెక్టరు ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించినట్లు విద్యాశాఖాధికారి షంషుద్దీన్ వెల్లడించారు.

● చాపాడు మండలంలోని రాజుపాలెం, వెదురూరు గ్రామాల్లో సుమారు 3వేల ఎకరాల్లో వేరుశనగ పంట నీట మునిగింది.

● దువ్వూరు మండలంలో శెనగపంట దెబ్బతింది.

● ఖాజీపేట మండలంలోని నదీ పరివాహక గ్రామాలైన ఏటూరు, త్రిపురవరం, తిప్పాయపల్లె, గంగవరం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద వరి సాగుచేశారు. కోత దశకు వచ్చింది. ఇది నేలకొరిగింది. చెన్నూరు మండలంలోనూ వరి నేలకొరిగింది.

● కడప మండలంలోని ఓబులంపల్లె, నజీర్‌బేగ్‌పల్లె, వాటర్‌గండి పరిధిలో కోత దశలో ఉన్న పంట కూడా నేలకొరిగింది. ఎకరాకు సుమారు రూ.40వేలు సాగు పెట్టుబడి పెట్టి పంట సాగుచేశారు. వర్షాలకారణంగా పంట కోయలేదు. ఇప్పుడు నేలపాలు కావడంతో వర్షాలకు మొలకలు వస్తున్నాయి. నోటికాడ కూడు నేలపాలైనట్లు చేతికి వచ్చిన పంట వర్షం ధాటికి దెబ్బతినిందంటూ రైతులు వాపోతున్నారు.

● వేంపల్లె, సింహాద్రిపురం, తొండూరు మండలాల్లో ఇటీవల మినుము సాగు చేశారు. ఆ పంట అంతా ఇప్పుడు మొలకదశలో ఉంది. వర్షాలతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● పోరుమామిళ్ల సమీపంలో ముద్దంవారిపల్లె వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఇక్కడ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● సగిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అట్లూరు మండలంలో సగిలేరు బ్రిడ్జిని బుధవారం తహశీల్దారు సుబ్బలక్షుమ్మ, పోలీసులు పరిశీలించారు.

● ఇక వర్షం ధాటికి కడప నగరం జలమయం అయింది. అప్సరా హాలు నుంచి ఆర్టీసీ బస్టాండు పోయే దారిలో రోడ్డంతా నీళ్లు నిలిచి కాలువను తలపించింది. అలాగే జయనగర్‌కాలనీలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల జలమయం అయింది. ఎన్జీవో కాలనీ, హోమియోపతి హాస్పిటల్ వద్ద మోకాటిలోతు నీళ్లు నిలిచాయి. వైజంక్షన్ నుంచి అప్సరా పోయే దారిలో రోడ్డంతా నీరు నిలిచిపోయింది. అలాగే రిమ్స్ వెళ్లే దారిలోని అండర్ బ్రిడ్జి వద్ద నీళ్లు నిలవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

| మండలాల వారీగా వర్షపాతం మి.మీలో.. | |
|---|---|
| కాశినాయన | 41.6 |
| బి.కోడూరు | 29.2 |
| చెన్నూరు | 28.8 |
| వల్లూరు | 28.4 |
| కమలాపురం | 25.8 |
| అట్లూరు | 24.2 |
| గోపవరం | 24.2 |
| ఎర్రగుంట్ల | 24.0 |
| పోరుమామిళ్ల | 23.4 |
| పెండ్లిమర్రి | 22.4 |
| బ్రహ్మంగారిమఠం | 22.4 |
| ఖాజీపేట | 20.0 |
| సింహాద్రిపురం | 19.6 |
| కలసపాడు | 18.6 |
| వేంపల్లె | 18.2 |
| బద్వేలు | 17.6 |
| ఒంటిమిట్ట | 17.4 |
| చింతకొమ్మదిన్నె | 16.6 |
| పెద్దముడియం | 15.8 |
| సిద్దవటం | 15.4 |
| కొండాపురం | 14 |
| ముద్దనూరు | 13.6 |
| తొండూరు | 13.6 |
| మైదుకూరు | 13.2 |
| చక్రాయపేట | 11.4 |
| రాజుపాలెం | 11.4 |
| పులివెందుల | 10.8 |
| చాపాడు | 10.6 |
| ప్రొద్దుటూరు | 9.8 |
| లింగాల | 9.4 |
| జమ్మలమడుగు | 8.4 |
| దువ్వూరు | 7.8 |
| వీఎన్‌పల్లె | 7.2 |
| మైలవరం | 6.6 |
| కడప | 6.4 |
| వేముల | 6.2 |


రాజుపాలెంలో రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న పంట తడుస్తున్న దృశ్యం



కడప నగరంలో రోడ్లపై వర్షపునీరు ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

## విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండండి

● 5 కంట్రోల్ రూములు ఏర్పాటు : ఎస్ఈ

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నిరంతర వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సమస్యలపై తక్షణ స్పందన కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్ఈ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల భద్రత దృష్ట్యా విద్యుత్ శాఖ ఇచ్చిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**భద్రతా సూచనలు**

వర్షాలు, గాలులు ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ స్తంభాలకు దగ్గరగా వెళ్లకూడదు. తడిగా ఉన్న స్విచ్ బోర్డులను చేతులతో తాకకూడదు. పొడి వస్తువుల సహాయంతోనే ఆన్ ఆఫ్ చేయాలి. తడిగా ఉన్న చేతులతో ఎలాంటి విద్యుత్ పరికరాలను తాకకూడదు. రైతులు తమ విద్యుత్ మోటార్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడైనా విద్యుత్ లైన్లు తెగి లేదా స్తంభాలు విరిగి పడినట్లు గమనిస్తే వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ సిబ్బందికి లేదా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 1912 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

**కంట్రోల్ రూమ్ నెంబర్లు**

విద్యుత్ శాఖలో సమస్యల పరిష్కారానికి జిల్లాలో ఐదు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కడప జిల్లా కంట్రోల్ రూమ్ 9440817440, కడప డివిజన్ 9901761782, పులివెందుల డివిజన్ 7893063007, ప్రొద్దుటూరు డివిజన్ 7893261958, మైదుకూరు డివిజన్ 9849057659

## శైవక్షేత్రాలకు వంద ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని జిల్లా, జిల్లాయేతర ప్రాంతాల్లో శైవక్షేత్రాలను దర్శించుకునే ప్రజల సౌకర్యార్థం కడప రీజియన్ పరిధిలోని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డిపోల నుంచి వంద ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీకమాసంలో ఈ నెల 27, నవంబరు 3, 10, 17 తేదీల్లో వచ్చిన సోమవారాల్లో జిల్లాలోని పొలతల, నిత్యపూజకోన, పుష్పగిరి, బ్రహ్మంగారిమఠం, లంకమల, అగస్త్యేశ్వరకోన, కన్యతీర్థం, నయనాలప్పకోన తదితర శైవక్షేత్రాలకు ఉదయం నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. దీంతో పాటు జిల్లా, రాష్ట్రేతర ప్రాంతాల్లో గల అరుణాచలం, పంచారామాలు, త్రిలింగ దర్శనం ప్రాంతాలకు ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో రాత్రి ఆరు డిపోల నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● పోలీసు శాఖ హెచ్చరిక

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు యంత్రాంగం హెచ్చరించింది. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు బుధవారం వివరించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటికి వెళ్లరాదన్నారు. నీటితో నిండిన వంతెనలను దాటడానికి ప్రయత్నించవద్దన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు తాకరాదన్నారు. చిన్నపిల్లలు బయటికి రావద్దని, నదీపరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పశువులను ఎత్తయిన ప్రదేశాలకు తరలించాలని, ఇళ్లల్లో తడిచిన స్విచ్ బోర్డులను తాకరాదని, పిడుగులు పడే సమయంలో చెట్లకింద నిలబడరాదని అన్నారు. పిడుగులు పడేలా ఉన్నప్పుడు ఆరుబయట ఉంటే మొబైల్ ఫోన్లు ఉపయోగించకూడదని తెలిపారు.

## పంట నష్టాన్ని నివారించుకోవాలి

● వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్

కడప రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంటలు మునకకు గురయ్యే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. మునకకు గురైన ప్రాంతాల్లో పంటల నుంచి జోము కాలువలు ఏర్పాటుచేసి పొలాల్లో ఉన్న అధిక నీటిని బైటికి పంపాలన్నారు. కోత దశలో ఉన్న వరి పంట కింద పడిపోతే వాటిని లేపి జడకట్టలు కట్టి నీటిలో మునగకుండా నివారించాలన్నారు. కోత దశలో ఉన్న వరి, మినుము, ఇతర గింజపంటలకు ఉప్పు ద్రావణాన్ని పిచికారిచేసి మొలకలు రాకుండా నివారించుకోవాలన్నారు. మునకకు గురైన పంటలలో నీటిని తొలగించిన తరువాత నష్టనివారణ కోసం నత్రజని, భాస్వరం ఎరువులు చల్లుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని 15 మండలాల్లో వరి, కంది, మినుము, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న పంటలు 2,296 హెక్టార్లలో దెబ్బతిన్నాయన్నారు.

## వైసీపీ వాళ్లే సూత్రధారులు

- 2023 నుంచే నకిలీ మద్యం తయారీ
- తంబళ్లపల్లె టీడీపీ కీలక నేత వైసీపీ మనిషే
- పథకం ప్రకారమే ఎన్నికల్లో టికెట్
- సోషల్ మీడియాలో ఓ మహిళ వాయిస్ హల్‌చల్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారిన నకిలీ మద్యం తయారీ వెనుక సూత్రధారులు వైసీపీ నాయకులే. ఈ తతంగం ఇప్పటిది కాదు.. వైసీపీ అధికారంలో ఉన్న 2023 నుంచే ఉంది. అయితే ఈ నకిలీ మద్యాన్ని ఇక్కడ తయారు చేయకుండా కర్ణాటకలో తయారు చేసి మన రాష్ట్రానికి యథేచ్ఛగా తరలించి అమ్ముకుని కోట్ల రూపాయలు సంపాదించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తూ ఉండడంతో భవిష్యత్తులో తమ వ్యాపారానికి ఎటువంటి ఇబ్బందులు ఉండకుండా ఉండేందుకు తమ బిజినెస్ పార్టనర్‌ను ఓ పథకం ప్రకారం తెలుగుదేశం పార్టీలో చేర్పించి టికెట్టు దక్కించుకున్నారు. ఓడిపోయినా తమ వ్యాపారానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా చేసుకుంటూ బాగా సంపాదించారు. ప్రస్తుతం ఈ వివరాలతో ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆడియోలో మాట్లాడిన మహిళ ఎవరైందీ స్పష్టంగా తెలియరాలేదు. ఆడియోలో ఉన్న దాని ప్రకారం తంబళ్లపల్లె మండలానికి చెందిన ఇద్దరు సోదరులు వైసీపీలో క్రియాశీలకంగా ఉంటూ బెంగళూరు కేంద్రంగా అనేక వ్యాపారాలు చేస్తున్నారు. ఆడియోలో మాట్లాడిన మహిళ భర్త కోవిడ్ సెకండ్ వేవ్‌లో చనిపోయారు. తర్వాత ఆమె తంబళ్లపల్లె మండలానికి చెందిన సోదరుల్లో ఒకరితో రెండున్నర సంవత్సరాల పాటు సహజీవనం సాగించింది. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు నడిచాయి. తర్వాత ఏమైందో? ఏమో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తి పోలీసుస్టేషన్ వరకు వెళ్లాయి. అతని మీద బెంగళూరు యలహంక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తంబళ్లపల్లె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వస్తే అప్పట్లో అక్కడ ఉన్న ఎస్ఐ ఫిర్యాదు తీసుకోలేదు. అసలు ఈ ఆడియో ఎలా బయటకు వచ్చిందని ఆరా తీస్తే ఎవరో కొందరు వ్యక్తులు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్ద స్థాయి అధికారులమంటూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడారు. నిజమే అని నమ్మిన ఆమె మాట్లాడిన మాటలను మొత్తం ఫోన్‌లో రికార్డు చేశారు. (ఫోన్‌లో ఆమెతో మాట్లాడిన వ్యక్తి కురబలకోటకు చెందిన ఓ టీడీపీ నాయకుడిగా ప్రచారంలో ఉంది.) గతంలో ఆమెతో సహజీవనం సాగిస్తున్న వ్యక్తి తన సమక్షంలో జరిగిన, ఆమె విన్న పలు విషయాలను మాట్లాడింది. అదే సమయంలో తంబళ్లపల్లె మండలానికి చెందిన వైసీపీ నాయకులు తమ వ్యాపార భాగస్వామిని టీడీపీలోకి పంపించి.. టికెట్టు ఇప్పించారని కూడా పలుమార్లు పేర్కొంది. అందరూ ఇక్కడ ప్రత్యర్థులుగా ప్రజల ముందు నటిస్తూ బెంగళూరులో కలిసి వ్యాపారాలు చేసుకుంటారని ఆమె ఆడియోలో పేర్కొంది. తన పేరు బయట పెట్టకుండా చూడాలని, తనకు ఆ నాయకులతో ప్రమాదముందని వాపోయింది. ఇప్పటికే పలుమార్లు ఆ వైసీపీ నాయకులు తనను చంపేస్తామని బెదిరించారని, తన ఫ్లాట్‌లోకి వచ్చి దాడికి యత్నించారని పేర్కొంది. ఇలా మీతో మాట్లాడిన విషయం బయటపడితే తనను చంపేస్తారని కూడా వాపోయింది. అయినా ఆమెను నమ్మించి ఫోన్‌లో మాట్లాడి అన్ని మాటలూ రికార్డు చేసిన వ్యక్తులు ఆ వాయిస్ రికార్డును పది రోజులుగా పలువురికి వినిపిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో ప్రస్తుతం ఆమె తీవ్ర ఇబ్బందుల్లోకి కూరుకుపోయినట్లు సమాచారం. ఈ ఆడియో మంగళవారం తొలుత కొందరు మీడియా ప్రతినిధుల చేతికి అందగా బుధవారం కొన్ని చానళ్లలోనూ ప్రసారం అయింది. దీంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా ఇదే ఆడియో విషయమే చర్చ నడుస్తోంది.

## ఒకటిన్నర కోటి కరెన్సీతో అలంకరణ

వేంపల్లెలోని అమ్మవారిశాలలో వాసవి కన్యకాపరమేశ్వరీ దేవిని కరెన్సీతో అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దీపావళి పూజలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.1.50కోట్లతో అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

- వేంపల్లె



## అందరూ క్రియాశీలకంగా పనిచేయాలి

● వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అకడమిక్‌గా పరిశోధనల పరంగా, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో అన్ని శాఖల విభాగాధిపతులు, సహచర అధ్యాపకులు క్రియాశీలకంగా వ్యవహరించాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. బుధవారం వీసీ చాంబర్‌లో అన్ని విభాగాల అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో నిర్వహించనున్న కాన్వకేషన్‌లో నిష్ణాతులైన వారికి గౌరవ డాక్టరేట్‌లు ఇవ్వాల్సి ఉంటుందని ఆ జాబితాను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. అలానే బంగారు పతక దాతలను గుర్తించి వారి ద్వారా విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చూడాలన్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో స్కాలర్ల హాజరు తప్పనిసరి అన్నారు. నాణ్యమైన రీసెర్చ్ పేపర్లను ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యేలా వారిని సమాయత్తం చేయాలన్నారు. రీసెర్చ్ మెథడాలజీ, పరిశోధన పద్ధతులు ప్రతి స్కాలర్ తెలుసుకోవాల్సిందేనని చెప్పారు. పీజీ అడ్మిషన్ల కోసం కార్యాచరణ రూపొందించాలన్నారు. అడ్మిషన్ల కోసం ప్రచారాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, అన్ని శాఖల అధిపతులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ పట్టలే.. ఆవాసాలుగా..

వర్షాకాలంలో పీలేరు వారపు సంతలో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులకు ఈ చిన్నారి ప్రయత్నం అద్దం పడుతోంది. పీలేరులో మంగళవారం కురిసిన వర్షానికి సంత ప్రాంగణం చిత్తడిగా మారింది. తండ్రితో పాటు సంతకు వచ్చిన ఓ కుర్రాడు బురదలో నడవలేక కోడి గుడ్ల అట్టలతో దారి ఏర్పాటు చేసుకుని తండ్రి వద్దకు చేరుకున్నాడు. వర్షాకాలంలో సంతలోని వ్యాపారులు, కొనుగోలుదారులు కొబ్బరి పీచు, పాత పేపర్లు, ప్లాస్టిక్ పేపర్లతో దారులు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది.



ప్లాస్టిక్ పట్టల కింద జరుగుతున్న పీలేరు వారపు సంత







పీలేరు సంతలో కోడి గుడ్ల అట్టలతో దారి ఏర్పరచుకుంటూ నడుస్తున్న ఓ బాలుడు



సంతలో చెత్త కుప్పల పక్కనే ఏర్పాటైన దుకాణాలు

- ఆదాయం ఘనం...వసతులు శూన్యం
- అభివృద్ధికి నోచుకోని పీలేరు వారపు సంత
- చినుకు పడితే చిత్తడే..
- నీడ, నీరూ కరువే

పీలేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిలకడగా ఆదాయం అందించే వనరులను అభివృద్ధి చేసుకుని దానిని సుస్థిరం చేసుకునేందుకు వ్యక్తులైనా, సంస్థలైనా చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. పీలేరు గ్రామ పంచాయతీ అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యంత ప్రాచీనమైన, అత్యంత ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే సంతగా పేరొందినా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో నిలిచిపోయింది పీలేరు వారపు సంత. ఎన్నో పాలకవర్గాలు మారినా పీలేరు వారపు సంత అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. దీంతో సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, తీవ్ర దుర్గంధాన్ని భరిస్తూ తమ కార్యకలాపాలు సాగించాల్సి వస్తోంది.

### సూపర్ మార్కెట్‌లకు తీసిపోని పీలేరు సంత

పీలేరులో ప్రతి మంగళవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో సంత జరుగుతుంది. సంతకు పీలేరుతో పాటు కేవీపల్లె, సదుం, పులిచెర్ల, కలికిరి, సోమల, పుంగనూరు మండలాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు, పీలేరుతో పాటు కల్లూరు, పుంగనూరు ప్రాంతాల నుంచి చాలా మంది హోల్‌సేల్ వ్యాపారులు వస్తుంటారు. సూపర్ మార్కెట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా నిత్యావసర సరుకులతో పాటు తాజా ఆకుకూరల దగ్గర నుంచి కాయగూరల వరకు సంతలో దొరుకుతాయి. సరుకుల రవాణాతో పాటు ప్రజల రాకపోకలకు కూడా సౌకర్యంగా ఉండడంతో పీలేరు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు తమకు వారానికి సరిపడా సరుకులు, కూరగాయలు పీలేరు సంత నుంచి తీసుకెళుతుంటారు. దీంతో గడిచిన దశాబ్దకాలంగా వారపు సంత వేలం పాట గణనీయంగా పెరిగింది.

### దుర్గంధభరితంగా సంత ప్రాంగణం

సంత తరువాత మిగిలే వ్యర్థాలను శుభ్రపరచకపోవడంతో ఆ ప్రాంగణమంతా దుర్గంధభరితంగా మారుతోంది. దానికి తోడు సంత పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను సంతలోనే పారవేస్తుండడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. చెత్తాచెదారాల నడుమే రైతులు తమ కూరగాయలు విక్రయానికి పెట్టడం, విధి లేక వినియోగదారులు కూడా అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది. మందుబాబుల రూపంలో సంతకు మరో సమస్య ఎదురవుతోంది. పగిలిన మద్యం సీసాల కారణంగా చాలామంది గాయాల పాలవుతున్నారు.

### అలంకారప్రాయంగా మరుగుదొడ్లు

సంతలోని మరుగుదొడ్లు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. వాటికి నిరంతర నీటి సరఫరా లేకపోవడంతో అక్కడున్న కాంట్రాక్టరు అందించే అరకొర నీటితోనే ప్రజలు కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సంతకు అధిక సంఖ్యలో వచ్చే మహిళా రైతులు మధ్యాహ్నంగానీ, రాత్రికి గానీ తమ ఇళ్లు చేరుతుంటారు. అంత వరకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వారు ఆరుబయట ప్రదేశాలను ఆశ్రయించక తప్పడం లేదు.

### ఆదర్శం.. సదుం పంచాయతీ

సంత అభివృద్ధిలో పీలేరుకు పొరుగున ఉన్న సదుం పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది. అక్కడున్న సంత ప్రాంగణంలో పక్కా నిర్మాణాలు ఉండడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. పీలేరు పంచాయతీ అధికారులు, పాలకవర్గం ఇప్పటికైనా సంత అభివృద్ధి గురించి పట్టించుకోవాలని పట్టణ ప్రజలు, వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

**సంత వేలం వివరాలు...**

| | |
|---|---|
| 2021-22 | రూ.10 లక్షలు |
| 2022-23 | రూ.10.85 లక్షలు |
| 2023-24 | రూ.12.65 లక్షలు |
| 2024-25 | రూ.10.47 లక్షలు(ఏడు నెలల కాలానికి) |
| 2025-26 | రూ.28.25 లక్షలు |

### సౌకర్యాలు కల్పిస్తే వ్యాపారాలు పెరుగుతాయి



సంతలో సరైన సౌకర్యాలు లేక మాలాంటి చిన్న వ్యాపారులకు వ్యాపారం అంతంత మాత్రంగానే జరుగుతా ఉంది. మట్టిలో కూర్చోవడమే కాకుండా కూరగాయలను కింద పెట్టుకోవడం వల్ల అవి దుమ్ముకొట్టుకుపోతున్నాయి. దీంతో చాలా మంది వాటిని చూడగానే ముఖం చిట్లిస్తున్నారు. ఇక వర్షం వస్తే మా పరిస్థితి దేవుడెరుగు. కూర్చోవడానికి కూడా వీలుండదు. సంతలో సౌకర్యాలు కల్పిస్తే మాలాంటి వాళ్లు ఇంకో నలుగురు బతుకుతారు.

- రెడ్డి శేఖర, చిరు వ్యాపారి, పీలేరు

### ప్లాట్‌ఫాంలు నిర్మించారు.. పైకప్పు మరిచారు

సంత ప్రాంగణంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో వ్యాపారులు ప్లాస్టిక్ పట్టల కింద దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అటు వ్యాపారులు, రైతులు, ఇటు వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ సంత చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో సంత ప్రాంగణంలో కాంక్రీట్ ప్లాట్‌ఫాంలు నిర్మించినా వాటికి పైకప్పు ఏర్పాటు చేయకపోవడంతో వాటి ఉపయోగం కూడా నామమాత్రంగా మిగిలింది. ఇక వర్షాకాలంలో వ్యాపారులు, ప్రజల బాధలు వర్ణనాతీతం. తమ వద్ద ముక్కుపిండి సెస్ వసూలు చేసే కాంట్రాక్టరు, పంచాయతీ పాలకవర్గం తమకు వసతులు కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. సంత ప్రాంగణంలోనే ఓ ఓవర్‌హెడ్ ట్యాంకు, ఆర్వో ప్లాంటు ఉన్నా సంతలో తాగునీటి వసతి మరిచారు. ఎప్పుడైనా విమర్శలు వచ్చినప్పుడు నాలుగు రోజుల పాటు నాలుగు మట్టి కుండల్లో నీరు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు.



సంత సగభాగంలో నిర్మించిన ప్లాట్‌ఫాంలు



వారపు సంతలో బురదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు

## శుభ్రత పాటించని కోళ్లఫారాలకు నోటీసులు



కోళ్లఫారాల యజమానులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

నిమ్మనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పరిశుభ్రత పాటించని కోళ్ల ఫారాల యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. కోళ్ల ఫారాలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వాటిని తక్షణం మూసివేస్తామన్నారు. బుధవారం రాచవేటివారిపల్లి పంచాయతీలోని గోసిరెడ్డి నాగరాజుకు చెందిన కోళ్ల ఫారాల వలన గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు రావడంతో సిబ్బందితో కలిసి కోళ్లఫారాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కోళ్ల ఫారాల యజమానులు కోళ్ల వ్యర్థాలను తొలగించకుండా, చనిపోయిన కోళ్లను గ్రామ సమీపంలో పడవేస్తుండడంతో ఈగలు ఎక్కువై ప్రజలు అంటురోగాలు, విషజ్వరాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కోళ్ల వ్యర్థాల నుంచి భరించలేని దుర్గంధం వస్తూ ఈగలు ఎక్కువగా పెరిగాయన్నారు. ప్రజారోగ్యంపై దెబ్బతీసే కోళ్లఫారాల యజమానులు తక్షణం ఈగలు రాకుండా స్ప్రే చేయాలన్నారు. ఒకవేళ ఈగలను అరికట్టకపోతే కోళ్లఫారాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కోళ్ల ఫారాల యజమానికి నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, కార్యదర్శి రజని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బాహుదా ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బాహుదా ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీవో రమేశ్, స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు నిండేందుకు కేవలం ఐదడుగులు మాత్రమే ఉందని, ప్రజలు నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## డ్యూటీ రోస్టర్లు మార్చాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ వర్కర్స్ జూనియర్ అసిస్టెంట్ల డ్యూటీ రోస్టర్లును ప్రతి మూడు నెలలకు మర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఆర్ఎంఓతో ఏఐటీయూసీ నేతలు, జూనియర్ అసిస్టెంట్లతో కలిసి చర్చలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏడాదిన్నరగా డ్యూటీ రోస్టర్లను మార్చకపోవడం, జూనియర్ అసిస్టెంట్లు సాయిప్రతాప్, లోకేశ్వర పాలన విషయంలో అజమాయిషీ చేస్తున్నారని ఆరోపించారు.

## ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి

- ఆసుపత్రి అభివృద్ధి సంఘ సమావేశంలో మంత్రి మండిపల్లి





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సంఘ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓపీ బాగా పెరిగిందని, రోజుకు 1000 మంది వైద్యం పొందడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా వసతులు కల్పిస్తామన్నారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన పరికరాలను సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు. క్రిటికల్ కేర్ ప్రారంభోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లినట్లు తెలియజేశారు. ప్రజల్లో నమ్మకం కలిగేలా వైద్యం అందించి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని వైద్యులకు సూచించారు. వైద్యం కోసం వచ్చిన వారిపై కొంతమంది వైద్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి రావడంతో ఎస్పీతో చర్చించి ఇక్కడ ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డు విధుల్లో ఉండేట్లుగా చూస్తానని హామీ ఇచ్చారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. ఆసుపత్రిలో రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో రాయచోటి ఏరియా ఆసుపత్రి వైద్యులు డేవిడ్ సుకుమార్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవి, కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, రాయదుర్గం లక్ష్మీదేవి, పలువురు వైద్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎనిమిది నామినేషన్లు

- నేడు నామినేషన్ల పరిశీలన..24న ఉపసంహరణ

మదనపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలకు ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక సొసైటీ కాలనీలోని సహకార శాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌లు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఇందులో బి.మహేష్‌కుమార్, ఎం.పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్.రెడ్డెప్ప, కె.వీరవెంకటశివాజీ, బి.శివానందనాయక్, కె.వెంకటాచలపతి, ఎస్.రెడ్డిషంషీర్, యు.నరేష్‌లు ఉన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలను సహకార శాఖ అధికారులు ప్రతిష్ఠాత్మంగా తీసుకుని అక్రమాలకు చెక్ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. మొత్తం 239 మంది ఓటర్లు ఉండగా అయిదేళ్ల పదవీ కాలంతో జరిగే ఈ ఎన్నికల్లో ఏడుగురు పాలకవర్గ సభ్యులు ఉండగా, వీరి నుంచి ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. పోలీసు బందోబస్తు మధ్య నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా, గురువారం నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థులను ప్రకటించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏడుగురు సభ్యులే ఉంటే ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులుగా ఎన్నికల అధికారి ప్రకటించనున్నారు. ఎనిమిది మంది పోటీలో ఉంటే తర్వాత అవసరాన్ని బట్టి 29న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో రెండు వర్గాలు పోటీ పడతాయని అటు స్థానికులు, ఇటు అధికారులు భావించారు. అయితే అందుకు భిన్నంగా ఒక వర్గం అభ్యర్థులు మాత్రమే ఎన్నికలకు ఉత్సాహం చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. కార్యక్రమంలో సహకార శాఖాధికారులు బి.దుర్గమ్మ, ఆడిటర్ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లె సర్వేయర్‌పై విచారణ

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె హంద్రీ-నీవా సుజల స్రవంతి యూనిట్-1లో స్పెషల్ సర్వేయర్‌గా పనిచేస్తున్న గుండ్రామి వెంకట్రమణపై విచారణ జరపాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భారీగా అక్రమాస్తులు కూడబెట్టిన వ్యవహారంలో గతంలో ఏసీబీ నమోదు చేసి కేసుకు సంబంధించి ఆ శాఖ డైరెక్టర్ జనరల్ ఆగస్టు 22న ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం సర్వేయర్‌పై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సర్వేయర్‌గా పనిచేస్తూ మదనపల్లెలో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ చేసిన తనిఖీల్లో వెల్లడయ్యింది. ఆస్తుల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు పొందలేదని, లేదా ఆస్తులకు సంబంధించిన వార్షిక నివేదికలను ప్రభుత్వానికి తెలియబరచలేదని కూడా ఏసీబీ ఆరోపించింది. విచారణను కొనసాగించడానికి ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం అభియోగాలకు సంబంధించిన చార్జిషీటు జారీ చేశారు.

## లారీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష



ముద్దాయి మహబూబ్‌బాషాను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతికి కారణమైన నిందితుడికి మదనపల్లె పీడీఎం కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద 2021 ఫిబ్రవరి 12 తేదీ ద్విచక్రవాహనంలో వెళుతున్న శ్రీహరి, తరుణ్‌కుమార్, ధనుష్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మిత్రులు అక్కడికక్కడే మృతి చెందారు. మదనపల్లె తాలూకా ఏఎస్ఐ సుబ్రమణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు మదనపల్లె పీడీఎం కోర్టుకు విచారణ రాగా కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయాధికారి సుభాన్ తీర్పు ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతికి కారణమైన రాయచోటికి చెందిన లారీ డ్రైవర్ మహబూబ్‌బాషాకు ఏడాది జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు.

## స్త్రీనిధి దుర్వినియోగంపై విచారణ



సంఘమిత్ర స్వాతి, మహిళా సమాఖ్య అధికారులను విచారిస్తున్న సీఐ కళా వెంకటరమణ

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మహిళా సమాఖ్య పరిధిలోని రేగంటివారిపల్లె 30 ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యుల స్త్రీ నిధి డబ్బు దుర్వినియోగంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. బుధవారం స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌లో సీఐ కళా వెంకటరమణ ఆధ్వర్యంలో ఏపీఎం ఖిజర్‌అహ్మద్ సమక్షంలో రేగంటివారిపల్లె సంఘమిత్ర స్వాతిని విచారించారు. 30 గ్రూపు సభ్యుల రూ.36 లక్షల స్త్రీ నిధి డబ్బు జమ చేయకపోవడంతో బ్యాంకు అధికారులు సంఘ సభ్యులకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆందోళన చెందిన మహిళా సభ్యులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సీఐ సంఘమిత్ర స్వాతిని పిలిచి విచారించారు. సంఘసభ్యులు చెల్లించిన డబ్బుకు రసీదులు ఉన్నాయా అని ప్రశ్నించారు. డబ్బు దుర్వినియోగంపై మూడు రోజుల్లో విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఏపీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, ఏసీ సాంబశివ, సీసీలు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివరామ్

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్‌కు వచ్చే టమోటా రైతుల శ్రేయస్సే ధ్యేయంగా మార్కెట్ కమిటీ సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులోని సమావేశ మందిరంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్ అధ్యక్షతన ట్రేడర్లు, వ్యాపారులు, రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని, కమీషన్ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. మార్కెట్‌లో వేలం టైమింగ్ మార్పు, 25 కిలోల క్రేట్ల బదులు, చిన్న క్రేట్ల వినియోగంపై చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న మదనపల్లె మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. ఛైర్మన్ శివరామ్ మాట్లాడుతూ మధ్యాహ్నం పూట వేలం నిర్వహిస్తే టమోటాకు ధరలు వస్తాయని తెలుస్తోందన్నారు. వ్యాపారులు, రైతులు నష్టపోకుండా నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు సి.నరసింహులు, జిలానినూరున్నిసా, డ్యాన్స్ రెడ్డెప్ప, మున్నానాయక్, లక్ష్మీపతి, శ్యామల, కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి అభిలాష్, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన కల్పించండి



పూలతోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలతో దెబ్బతిన్న ఉద్యానపంటలను కాపాడుకోవడంలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి తెలిపారు. బుధవారం మదనపల్లె మండలం సీటీఎం కొత్తవారిపల్లె గ్రామాల వద్ద ఉద్యానపంటలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ టమోటా పంట సాళ్లలో నిలిచిన వర్షపు నీటిని దిగువ ప్రాంతాల్లోకి పారేలా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం ఆగిన వెంటనే 5 లీటర్ల నీటికి 19-19-19 కలిపి సూక్ష్మపోషకాలతో నీటి మిశ్రమాన్ని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఉద్యాన శాఖ అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, వీపీఏలు, పాల్గొన్నారు.

## ఉపాధి హామీ అంబుడ్స్ పర్సన్‌గా శ్రీరాములు

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలును పర్యవేక్షిస్తూ సమస్యలను, ఫిర్యాదులపై విచారణ జరిపి పరిష్కార మార్గాలు సూచించడం కోసం జిల్లా అంబుడ్స్ పర్సన్‌గా కె.శ్రీరాములును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కూలీలు, ఇతర వర్గాల నుంచి అందే ఫిర్యాదులను అంబుడ్స్ పర్సన్ పరిష్కరించి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. జిల్లాలో ఉపాధి హామీలో జరిగే అక్రమాల గురించి ప్రతి మూడు నెలలకూ ప్రభుత్వానికి నివేదికలు అందజేయాల్సి వుంది. అంబుడ్స్ పర్సన్ నియామకం, విధులు, బాధ్యతలకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# ‘పండని’ తమలపాకులు



రాంసాయినగర్‌లో సాగు చేసిన తమలపాకు తోట

- మూడేళ్లుగా కనిపించని లాభాలు
- సాగుకు వెనుకాడుతున్న రైతులు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు తమలపాకును లక్ష్మితో సమానంగా చూస్తారు. తమలపాకు తోట ఉంటే లాభాలు వెంట ఉన్నట్లేనని భావిస్తారు. ఇది మునుపటి పరిస్థితి. ఈ తోటలు సాగు చేసిన రైతులు లాభాలమాట అటుంచి నష్టాలు మూటకట్టుకోకపోతే చాలు అనే అభిప్రాయంలో ప్రస్తుతం ఉన్నారు. అయితే ఎప్పుడో ఒకసారి ధరలు పండకపోతాయా, లాభాలను ఆర్జించలేక పోతామా అనే ఆశతో ముందుకు సాగుతున్నారు.

దువ్వూరు మండలంలో ఒకప్పుడు 150 ఎకరాల దాకా తమలపాకు తోటలు ఉండేవి. ఆ విస్తీర్ణం బాగా తగ్గి నేడు 70 ఎకరాలకు వచ్చింది. ఈ పంట సాగులో లాభాలు రాకపోవడమే కారణమని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో దువ్వూరు, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, ఇడమడక, క్రిష్ణంపల్లె ప్రాంతాల్లో ఈ తమలపాకు తోటలు సాగు చేసేవారు. అయితే గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మునుపు ధరలు ఆశాజనకంగా ఉండేవి. 60 కట్టలు (సట్టలు) కలిగిన బుట్ట ధర రూ.3వేలకు పైగా ధర ఉండేది. ప్రస్తుతం అదే బుట్ట రూ.700 నుండి రూ.1000కి పడిపోయి మూడేళ్లుగా ఆటుపోట్ల మధ్య కొనసాగుతోందని రైతులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. మునుపు చెన్నై, హైదరాబాదు, నిజమాబాదు, బెల్గాం, కొల్హాపూర్, ముంబై, సోలాపూర్ ప్రాంతాలకు తమలపాకులు ఎగుమతి చేసేవారు. మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ప్రస్తుతం చెన్నై, హైదరాబాదుకు మాత్రమే ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు.

**భారీగా పెట్టుబడి వస్తోంది..**



తమలపాకు తోటలు సాగు చేయాలంటే పెట్టుబడులు భారీగా అవుతున్నాయి. ఎకరాలో ఈ పంట వేస్తే దిగుబడి అందే సమయానికి రూ.3లక్షలు ఖర్చు అవుతోంది. రాంసాయినగర్, మూడిండ్లపల్లె, నాగసానిపల్లె గ్రామాల్లో నేను తమలపాకు తోటలు సాగు చేశాను. లాభాలు కనిపించక మూడేళ్లు అవుతోంది. చాలా మంది వీటి సాగుకు వెనుకడుగువేస్తున్నారు. ఆశకొద్దీ కొందరం తోటలు కోస్తున్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమలపాకు సాగుకు చరమగీతం పాడుతాం.

- ఎన్.వెంకటేశ్వరరెడ్డి, రైతు, పెద్దజొన్నవరం

## ఘనంగా ఆకాశ దీపోత్సవం



ఆకాశ దీపాన్ని లాగుతున్న ఈఓ కృష్ణానాయక్, రాజారెడ్డి

పెండ్లిమర్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల మల్లికార్జునుడి దేవస్థానంలో బుధవారం ఆకాశ దీపోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈఓ కృష్ణానాయక్ మాట్లాడుతూ కార్తీక మాస ఉత్సవాలను పురష్కరించుకుని భక్తుల సౌకర్యార్థం వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే ఉచిత ప్రసాదం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, క్రీడా విభాగం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జున అవార్డు, అర్జున (లైఫ్ టైం అవార్డు), మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు, ద్రోణాచార్య అవార్డు, ద్రోణాచార్య (లైఫ్ టైమ్ అవార్డు), రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక పురస్కార్‌లకు అర్హత కలిగిన క్రీడాకారులు, కోచ్‌లు సంస్థలు www.dbtyas-sports.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 28వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు పంపుకోవచ్చని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లు, సంఘాలకు సంబంధించిన వివరాలపై పోర్టల్‌లో లభ్యమయ్యే మార్గదర్శకాలు పరిశీలించి, గడువులోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేశారు.

## ఎస్‌జీఎఫ్ డివిజనల్ స్థాయి ఎంపికలు



డివిజనల్ స్థాయి యోగా విజేతలు

పులివెందుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రమణప్ప)లో బుధవారం ఎస్‌జీఎఫ్ డివిజన ల్ స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా బుధవారం యోగా, చెస్, వాలీబాల్, సెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారిని ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ డివిజనల్ కోఆర్డినేటర్ ఫ్రాన్సిస్ రవికుమార్, జిల్లా కార్యదర్శి విక్టర్ ఇమ్మానియేల్, ఆర్గనైజర్స్ జీవీసీ కేల్కర్, టి.ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు.

## క్లబ్బులపై డీఎస్పీ బృందం దాడి




క్లబ్బులో వార్నింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళినాయక్

పులివెందుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని రెండు క్లబ్బులపై డీఎస్పీ మురళినాయక్ బృందం దాడులు నిర్వహించింది. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని లయన్స్ క్లబ్, లిటరరీ క్లబ్‌లపై దాడులు నిర్వహించారు. గతంలో ఈ రెండు క్లబ్బులలో ఎలాంటి గ్యాంబ్లింగ్ ఆడవద్దని డీఎస్పీ ఆదేశించారు. అప్పటి నుంచి గ్యాంబ్లింగ్ జరగలేదు. కానీ గత రెండు మూడు రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ, అర్బన్ సీఐ సీతారామిరెడ్డి, ట్రాఫిక్ సీఐ హాజీవలి, వేముల ఎస్ఐ ప్రవీణ్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్కడున్న వారికి డీఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. గ్యాంబ్లింగ్ వంటి కార్యక్రమాలు చేపడితే కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు.

## నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

- మున్సిపల్ వర్కులపై నివేదిక ఇవ్వాలని లేఖ
- వర్కుల జాబితా సిద్ధం చేసి పంపిన మున్సిపల్ అధికారులు



ప్రొద్దుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సి పాలిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ కడప రీజనల్ అధికారులు దృష్టి సారించారు. ఆమేరకు 2019 జూన్ నుం చి 2024 మే వరకు మున్సిపా లిటీలో జరిగిన వర్కులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు అక్టోబరు 9వ తేదీ విజిలెన్స్ అధికారులు లేఖ పంపారు. అందులో అక్టోబరు 16 లోపల బేసిక్ డేటా ప్రొఫార్మ-ఎ, ప్రొఫార్మ 501, 501 ఏ, 501బీలలో రూపొందించిన విధంగా సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే బిల్లులకు సంబంధించి పేమెంట్స్ ఎంత మేర జరిగాయో తెలపాలన్నారు. ప్రోగస్ ఆఫ్ వర్క్, చెక్‌మెజర్‌మెంట్ స్టేట్ మెంట్ తదితరాలు సమర్పించాలని కోరారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 1100 వర్కులు జరిగాయి. ఇందులో టెండర్ నిబంధనల ఉల్లంఘనలు వున్నాయి. ముఖ్యంగా ఒకే వర్కును నాలుగు భాగాలుగా విభజించి రూ.40లక్షల లోపు పనులు చేశారని ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 15 ఫైనాన్స్ గ్రాంట్ వర్కులను జనరల్ ఫండ్ కింద పనులు చేసి, నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలున్నాయి. జనరల్ ఫండ్ వాడు కోవాల్సిన లిమిట్స్ కంటే అధికంగా దుర్వినియోగం చేసి.. దాదా పు రూ.70కోట్ల మేర ఖర్చు చేశారని ఆరోపణలున్నాయి. సింగ ల్ టెండర్లు ఎక్సెస్ రేట్లకు టెండర్లు వేసినవి కూడా టెండర్ నిబంధనలు ఉల్లంఘించి చేసినవి వున్నట్లు ఆరోపణలున్నాయి. గత ఏడాది నవంబరులో మున్సిపల్ ఆర్‌డీ నేతృత్వంలో దాదా పు నెల రోజులపాటు నాలుగు జిల్లాల అధికారులు ప్రత్యేక టీంలుగా వచ్చి విచారణ చేపట్టారు. కానీ ఆ విచారణ నివేదిక ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వానికి అందజేసినా నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేడు మళ్లీ విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వైసీపీ హయాంలో మున్సిపాలిటీలో జరిగిన పనులపై విచారణ చేపట్టనున్నారు. దీంతో ఏడాదికి పైగా వైసీపీ అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన జరగుతూనే వుందనే ఆరోపణలున్నాయి.

## అప్పుల బాధతో రైతు మృతి



నాయుడు బాబు (ఫైల్)

పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక కల్వకూరి నాయుడు బాబు (35) అనే రైతు విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి కమ్మవారిపల్లె సమీపంలోని చెంచు కాలనీకి చెందిన నాయుడు బాబు ఐదేళ్లక్రితం తనకున్న ఎకరా పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పసుపు, పత్తి పంటలు సాగు చేశాడు. సక్రమంగా పండకపోవడంతో నష్టాన్ని చవిచూశాడు. దీంతో పంటల సాగుకోసం చేసిన అప్పులు ఐదేళ్లకు రెట్టింపు కావడంతో వ్యవసాయం వదిలి కూల్‌డ్రింక్ షాపు నిర్వహించాడు. అందులో కూడా నష్టాలు రావడంతో ఈనెల 18న విషద్రావణం తాగాడు. కుటుంబ సభ్యులు పోరుమమిళ్లలోని ఆసుపత్రికి.. అక్కడి నుంచి నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుని తల్లి కలవకూరి లక్షుమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుడికి భార్య సురేఖ, కుమార్తెలు వెంకటపూజిత, మౌనిత ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## విద్యుత్ షాక్‌తో పందులు మృతి



మృతి చెందిన పందులు

వల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వల్లూరులోని సంపద తయారీ కేంద్రం వద్ద విద్యుత్‌షాక్‌తో మూడు పందులు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గత రాత్రి కురిసిన వర్షానికి వల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో సంపద తయారీ కేంద్రం వద్ద విద్యుత్ తీగలు కిందకు వంగి రేకులకు తగిలాయి. ఆ రేకులు కాస్త ఇనుప గేటుకు అనుసంధానమై ఉండటంతో విద్యుత్ ప్రసరించి పందులు తగలగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఓ పక్క వర్షం కురుస్తుండడంతో అక్కడ ఎవరూ లేకపో వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం గమనించిన స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగా వారు విద్యుత్ వైర్లను కట్ చేసి ప్రమాదాన్ని తప్పించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్లకు గాయాలు

సీకేదిన్నె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి రోడ్డులోని కొత్తరోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, లారీ డ్రైవర్లు శ్రీనాథ్, యేసుదాసులకు స్వల్ప గాయాలయ్యాయి. రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న మారుతీ కారు కొత్త రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ కడప నుంచి డంపింగ్‌యార్డుకు చెత్తను తరలిస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం దెబ్బతింది. అదే సమయంలో కారులోని హెయిర్‌బెలూన్ తెరచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయాలతో బయటపడిన డ్రైవర్లను హైవే పెట్రోలింగ్ పోలీసులు 108లో రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### జమ్మలమడుగులో వ్యక్తికి...

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఎస్ఆర్ పెట్రోలు బంకు సమీపాన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. జమ్మలమడుగు మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న రమణారెడ్డి అనే ఉద్యోగి జమ్మలమడుగు నుంచి రాత్రి ప్రొద్దుటూరుకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రమణారెడ్డికి తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి... అక్కడి నుంచి హైదరాబాదు యశోధ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు జమ్మలమడుగు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇద్దరు అదృశ్యం



కేతనగిరి వెన్నెల

మైదుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం కొత్త కొట్టాలకు చెందిన కేతనగిరి వెన్నెల ఈనెల 20వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరానట్లు ఆమె కుమారుడు వెంకటరమణ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సదరు మహిళ విషద్రావణం తాగి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడుతున్నట్లు సామా జిక మాధ్య మాలలో ఒక వీడియో ప్రసారం అవుతోంది. అయితే ఆమె కాదా అని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.



భూమిరెడ్డి ఇస్రాయిల్

మున్సిపాలిటీ పరిధి బద్వేలు రోడ్డులోని మహబూబ్ నగర్‌కు చెందిన భూమిరెడ్డి ఇస్రాయిల్ (35) ఈ నెల 3వ తేదీ అదృశ్యమయ్యాడు. ఇస్రాయిల్ కర్ణాటకు రాష్ట్రం బళ్లారికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో అతని భార్య భూమిరెడ్డి స్వప్న మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వీరి ఆచూకీ తెలిస్తే 9121100618, 9121100619 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

## హామీలను అమలు చేయాలి

వేంపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పింఛనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తాం, మెరుగైన పీఆర్సీ అమలు చేస్తాం, అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తాం, రావాల్సిన బకాయిలు చెల్లించే ఏర్పాటు చేస్తాం తదితర హామీలు ఇచ్చారన్నారు. ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు, పింఛనర్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అలాగే చంద్రబాబుపాలనలో రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీ అయిందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వానికి ఎన్నోమార్లు మొరపెట్టుకున్నాయన్నారు. కానీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు.

## పేదల బియ్యం అక్రమ రవాణాకు చెక్



తనిఖీలకు ఉపయోగించే కిట్

కడప కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కిచ్చే సబ్సిడీ బియ్యం అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. దొంగెవరో.. దొరెవరో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో అయితే ఇంటింటికి బియ్యం పంపిణీకి ఎండీ యూ వాహనాలకు లైసెన్స్ ఉండడంతో బియ్యం అక్రమ రవాణాకు ఆన వాళ్లు దొరకేవి కావు. ఇలాంటి పరిస్థితులను కట్టడి చేసేందుకు కూటమి సర్కారు నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పేదల బియ్యం అనే విష యాన్ని గుర్తించేందుకు వీలుగా.. ఏసీబీ దాడుల్లో అవినీతి సొమ్ము ఎలా అయితే కెమికల్స్ ద్వారా గుర్తిస్తారో అదే తరహాలో అక్రమంగా తరలించే బియ్యాన్ని గుర్తించేందుకు ద్రావకంతో కూడిన కిట్లను జిల్లాల వారీగా సరఫరా చేశారు. ప్రభుత్వం పోషక విలువలతో రూపొందిం చిన ఫోర్టిఫైడ్ బియ్యంను ఈ కెమికల్స్‌తో పరీక్షల ద్వారా నిర్ధారించే అవకాశం ఉంది. దీంతో ఇన్నాళ్లు సాధారణ బియ్యం మాటున అక్రమంగా తరలిపోతున్న పేదల బియ్యం కట్టడికి రెడ్ సిగ్నల్ పడనుంది. బుదవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురామ్ జిల్లాకు 9 కిట్లు రాగా అందులో నియోజకవర్గానికి ఒక కిట్ చొప్పున ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ తహశీల్దార్లకు పంపిణీ చేశారు. మిగతా రెండు కిట్లను ఏఎస్‌వోలకు అందజేశారు.

## ఇది...శ్మశాన వాటికే..!



కంపచెట్లు, జంబుతో సమాధులు సైతం కనిపించని అలాంఖాన్‌పల్లె శ్మశానవాటిక

- శవాలను పూడ్చలేని దుస్థితి
- ఏళ్ల తరబడి సాగుతున్న సమస్య
- పరిష్కారం చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు



శ్మశానవాటిక చుట్టూ ఉన్న మురుగునీరు

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అది పేరుకే శ్మశానవాటిక. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అక్కడ శవాలను పూడ్చలేని దుస్థితి. సాధారణంగా శ్మశాన వాటికలో ఎవరైనా మృతి చెందితే వారికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ ఆ పరిస్థితి లేదు. శ్మశానవాటిక చుట్టూ మురుగునీరు, కంపచెట్లు, ఏపుగా పెరిగిపోయిన జమ్ముతో నిండి.. కనీసం శ్మశానవాటికలోని సమాధులు సైతం కనిపించని పరిస్థితి. ఇక గ్రామంలో ఎవరైనా మృతి చెందితే.. శవాన్ని శ్మశానవాటికలోకి తీసుకెళ్లాలంటే నరకయాతనే. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటే. కడప నగరానికి అత్యంత సమీపంలోని ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటికలో నెలకొంది.

కడప నగరం 49వ డివిజన్ పరిధిలోని ఆలంఖాన్ పల్లెలో దాదాపు వేల మంది జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని గ్రామ ప్రజలు ఏళ్ల తరబడి మొరపెట్టుకుంటున్నా పట్టించుకునేవారే లేరని వాపోతున్నారు. ఇటీవల శ్మశానంలో శవాన్ని పూడ్చే పరిస్థితి లేకపోవడంతో కడప-కర్నూలు రహదారిపై రాస్తారోకో చేపట్టి ఆందోళన చేశారు. దీంతో అధికారులు అక్కడకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పి... ఆ తర్వాత షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టి సారించి శ్మశానవాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల్లో వెలుగులు నింపిన సీఎం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం రోజున వెలుగులు నింపేలా ఆరు సంవత్సరాలుగా పదోన్నతులకు నోచుకోని ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు ఆర్టీసీ కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి ఎం.పురుషోత్తం కొనియాడారు. ఆర్టీసీ కార్మిక పరిషత్ కడప డిపో ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్ఎం కార్యాలయం ఆవరణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక పరిషత్ నాయకులు రహ్మతుల్లా, ఖాజాపీర్, బాస్కర్, గౌస్‌బాషా, శ్రీధర్, దినకర్ పాల్గొన్నారు.

## వైవీయూ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయ వసతి గృహాలను బుధవారం ఉదయం విద్యార్థుల అల్పాహారం తీసుకునే సమయంలో వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అకస్మికంగా తనిఖీ చేశారు. అల్పాహారం రుచి ఎలా ఉంది, రోజూ భోజనం, కూరలు రుచికరంగా ఉంటున్నాయా లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు రికార్డులను చూశారు. విద్యార్థినిలు ఉంటున్న వసతి గృహంలోను మెనూ గమనించారు. ఆయనతో పాటు వసతి గృహాల చీఫ్ వార్డన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డాక్టర్ రెడ్డయ్య తదితరులు ఉన్నారు.

## జడ్జికి సమస్యలు విన్నవించిన విద్యార్థినులు

కడప రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థసెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ బుధవారం కడప నగరం చిన్నచౌక్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జడ్జికి సమస్యలను విన్నవించారు. టీచర్ల కొరత ఉందని, భవనాల రిపేర్లు ఉన్నాయని, ఐదు సంవత్సరాల నుంచి కాస్మెటిక్ చార్జీలు ఇవ్వడం లేదని సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, ఆరో ప్లాంట్ సదుపాయం లేదని జడ్జికి విన్నవించారు. అనంతరం వసతి గదులను, టాయిలెట్లను, భోజన సదుపాయాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే కడప నగరం మోచంపేటలోని ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేశారు.

## 'విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన లోకేశ్'

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఐటీ, ఎలక్ట్రానిక్స్ రాష్ట్ర మంత్రి నారాలోకేశ్ శ్రీకారం చుట్టారని తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం గర్వించే విధంగా గూగుల్ సంస్థలతో కలిసి సాంకేతిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, డేటా సైన్స్ హబ్‌గా మలచడమే ఏకైక లక్ష్యంగా లోకేశ్ ముందుకు సాగుతున్నారన్నారు.

## ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ టి.చెన్నరాయుడు (ఎఆర్‌హెచ్‌సీ 521) కుటుంబానికి జిల్లాఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ రూ.2.5లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.చెన్నరాయుడు సతీమణి టి.సుగుణమ్మకు ఎస్పీ ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏవో కె.వెంకటరమణ, డీపీవో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌నాయక్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అతలాకుతలం..!

రెండు రోజులుగా కురుస్తున్న వాన ● లోతట్టు ప్రాంతాలు జలమయం ● జనజీవనం అస్తవ్యస్తం
వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ● నీట మునిగిన పంటలు ● ఆందోళనలో రైతులు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం నుంచి జిల్లాలో జోరు వాన కురి సింది. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షంతో జనజీవనం అతలాకుతలమైంది. భారీ వర్షంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. ఆగిఆగి కురుస్తున్న వర్షంతో పనులు కాక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నవంబర్ 2వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

**లోతట్టు ప్రాంతాలు జలమయం..:** కడప నగరంలో సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా జయనగర్‌కాలనీ ఎన్జీఓ కాలనీ మృత్యుంజయకుంట, రామాంజనేయపురం, రామరాజుపల్లె ప్రాంతాల్లో వరదనీరు నిలిచింది.అలాగే ప్రధాన రహదారులు అప్సర సర్కిల్ వై.జంక్షన్ హోమియోపతి కళాశాల రోడ్, రిమ్స్ అండర్ బ్రిడ్జి పూర్తి జలమయామయ్యాయి.

**స్తంభించిన రాకపోకలు..:** హోమియోపతి కళాశాల రోడ్డు పూర్తిగా జలమయం అవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సన్‌సిటీ, ఏఎస్ఆర్‌నగర్, ఆచారి కాలనీ, రామాంజనేయనగర్ ప్రజలు టౌన్‌కి రావాలంటే హోమియోపతి కళాశాల రోడ్డు ఒక్కటే మార్గం. ఈ మార్గం పూర్తిగా జలం అవడంతో వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



కమలాపురం... చదిపిరాళ్ల గ్రామ సమీపంలోని పొలాల్లో నీట మునిగిన మినుము పంట



కడపలో జలమయమైన రోడ్లు

### కమలాపురంలో నీట మునిగిన మినుము పంట

కమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అధిక వర్షాలకు మండలంలో మినుము పంట నీట మునిగింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మినుము పంట వర్షం నీటిలో మునిగింది. వర్షాలు వచ్చాయి పదను దాటిపోతుందని ఎంతో ఆశతో రైతులు శనగ, మినుము పంటను సాగు చేశారు. అయితే ఆ ఆశ చాలా రోజులు నిలవలేదు. మండలంలో దాదాపు 700 ఎకరాల్లోశనగ, మినుము పంట సాగు చేసినట్లు వ్యవసాయశాఖ సిబ్బంది అంచనా వేశారు. వ్యవసాయసిబ్బంది పంట నష్టం గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### వర్షాలకు నేలవాలిన వరి

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు గుర్రంపాడు, కొండపేట రామనపల్లె ప్రాంతాల్లో కోత దశలో ఉన్న వరి నేలవాలింది. అంతేకాక మరో రెండు,మూడురోజుల్లో వర్షాలు రాకపోతే కోయాల్సిన వరి నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తునారు. కాగా ఏవో శ్రీదేవి పంట నష్టం అంచనాలు తయారు చేశారు.



కడపలో వర్షం నీటిలో ఆపసోపాలు పడుతున్న వాహనచోదకులు

## ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన ఎమ్మెల్సీ



పులివెందుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) లోతేటి శివశంకర్‌ను ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కలిశారు. బుధవారం తిరుపతిలో లోతేటి శివశంకర్‌ను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ కలిసి శాలువ కప్పి అభినందనలు తెలిపారు.

## శివాలయాల్లో ఆకాశదీపం ఆవిష్కరణ

ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభమైన సందర్భంగా శివాలయాలు కార్తీక శోభతో కళకళలాడుతున్నాయి. మండల వ్యాప్తంగా అన్ని శివాలయాల్లో కార్తీక దీపాలను ఆవిష్కరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమా లకు ఆయా గ్రామాల్లోని మహిళలు, ప్రజలుపెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

**వీరపునాయునిపల్లె..:** మండల పరిధలోని అనిమెల గ్రామ సమీపంలోని పాపాఘ్ని, పావని, మొగమోరు సంగమం వద్ద వెలసిన సంగమేశ్వర ఆలయం కార్తీక మహోత్సవాలకు ముస్తాబవుతోంది.



చెన్నూరులో...

## కోటి సంతకాల సేకరణ

కమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేద ప్రజలను వైద్య సేవలకు దూరం చేసే వైద్యకళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కమలాపురం నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా వైసీపీ అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

కమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23 నుంచి 30వతేదీ వరకు మండలం పరిధిలోని పాఠశాలలో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గౌస్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమలాపురం మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో 23 నుంచి 30 వరకు 8 రోజులు ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆధార్ క్యాంపులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దచెప్పలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, దేవరాజుపల్లె, పందిళ్లపల్లె, సంబటూరుల్లో ఉంటుందన్నారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు ప్రశంసనీయమని ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి తెలిపారు. బుధవారం కడపనగరం రైల్వే కాలనీ మేరీ నగరంలో కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. వారం రోజుల పాటు విద్యార్థులు ప్రతి రోజు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా ఎంపికైన ఎస్.మహమ్మద్ గఫార్, ఎం.కుళాయిరెడ్డి, హర్షవర్ధన్‌కు ప్రిన్సిపాల్ చేతులమీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే పాల్గొన్న విద్యార్థులందరికి కూడా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## వరుస దొంగతనాలతో
# బెంబేలెత్తుతున్న రైతులు

సీకేదిన్నె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు వరుస దొంగతనాలతో బెంబేలెత్తిపోతున్నారు. పొలాల్లో మోటార్ల విద్యుత్తు కేబుల్ వైర్లు, డ్రిప్ సామగ్రిని దొంగలిస్తుండడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో అల్లాడుతున్నారు. పగలు పంట పొలాల్లో పనిచేసుకుని రాత్రి ఇంటికి వస్తే ఏ మోటారు వద్ద దొంగలు దోచుకుపోతారోనని ఆవేదన చెందుతున్నారు. అలాగని పగలు పనిచేసి రాత్రిపూట పొలాల్లో కావలి కాయలేక మదనపడుతున్నారు. స్థానికంగా పాతసామాన్లుకొంటూ పల్లెల్లో తిరుగుతూ రాత్రి సమయాల్లో దొంగతనాలు చేస్తున్నట్లు స్థానిక రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ దొంగతనాలు ఎక్కువ అవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఆదివారం బుగ్గలేటిపల్లె వద్ద ఓ తోటలో మూడు ఎకరాల డ్రిప్ పైపులు, 150 మీటర్ల విద్యుత్తు వైరు దొంగతనానికి గురయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే బోడెద్దులపల్లె గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లలో విద్యుత్తు వైర్లు కూడా దొంగలించడంతోపాటు ఇప్పెంట జగనన్న కాలనీలో ఖాళీగా ఉండే ఇళ్లల్లో ఇంటిసామాగ్రిని దొంగలు దోచుకెళ్లినట్లు సమాచారం. దొంగలు తెచ్చే ఇటువంటి వస్తువులను వ్యాపారులు కొనుగోలు చేయకుండా నివారిస్తే దొంగతనాలు కొంతవరకైనా తగ్గే అవకాశం ఉందని రైతులు కోరుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## డాక్టర్ వైఎస్సార్ ఈఎఫ్‌ఏయూలో వైసీపీ దోపిడీ

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైసీపీ హయాంలో దోపిడీకి గురైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఓ వైసీపీ నేతకు ఆర్థిక వనరులుగా ఏర్పడిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం జారీచేసిన నిబంధనల మేరకు యూనివర్సిటీని వైవీయూ ప్రాంగణంలోకి త్వరితగతిన మార్చాలని డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం బసవతారకం లా కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వైసీపీ నేతలకు ఆర్థిక వనరులుగా మారిందన్నారు. వైసీపీ హయాంలో వైఎస్ భారతిరెడ్డి సమీప బంధువు యూనివర్సిటీకి రిజిస్టర్, వైస్ చాన్సెలర్, ప్రిన్సిపల్‌గా తానే ఉంటూ యూనివర్సిటీ నిధులను దోచుకున్నట్లు ఆరోపించారు. దాదాపు 8 నెలలు కావస్తున్నా యూనివర్సిటీని మార్చకపోవడంతో కోట్ల రూపాయలు వృథాగా చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమురం భీమ్ జయంతి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బీటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం కొమురం భీమ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున, జిల్లా అధ్యక్షుడు మేండ్రగుత్తి గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎ.రాజబాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కట్టా గంగాధర్, జిల్లా కార్యదర్శి ఇ.సురేంద్ర, ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

## పైపులైను పగిలి కలుషితమవుతున్న నీరు



పెండ్లిమర్రి,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నంది మండలం గ్రామంలో పాత హరిజనవాడకు తాగునీటిని అందించే పైపులైను పగిలి నీరు కలుషితమవుతున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించు కోవడం లేదని, హరిజనవాడ వాసులు తెలిపారు.పైపు పగిలి పోవడం వలన ఆ పైపులోనికి చిరు కప్పలు,పురుగులు,వర్షపునీరు చేరుతోందన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రమాదేవిని వివరణ అడగ్గా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరి స్తామన్నారు.

## నగరంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడపనగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బుధవారం కడప నగరం 37వ డివిజన్ అల్మాస్‌పేట సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు రికార్డులు పరిశీలించారు. అనంతరం బుగ్గవంక, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి వర్షపునీరునిల్వ సమస్యలను పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ నెంబర్ 9949093772 ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు చెప్పిన సమస్యలకు వెంటనే స్పందించాలని సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేశారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. వర్షం కారణంగా జమ్మలమడుగులో విద్యార్థులు, ప్రజలు పెన్నానదిలోకి వెళ్లరాదని పిడుగులు పడే అవకాశం ఉందని, వంకలు, వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్తు తీగెలు, స్తంభాల వద్ద ఉండరాదని తెలిపారు.

## మండల కమిటీ ఎంపిక

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం మండల కమిటీ ఎంపిక బుధవారం జరిగింది. దువ్వూరు మండల అధ్యక్షునిగా టి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్‌రెడ్డి, కార్యదర్శిగా మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆ సంఘ సభ్యులు తెలియజేశారు.

## ప్రత్యేక పూజలు

కొండాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కావడంతో మండలంలో పలు ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలంలోని బాలప్పకోన, మల్లేశ్వరకోన, కొండాపురం, గండ్లూరు తదితర శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే ఆలయాలు, ఇళ్ల వద్ద మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.

## జాగ్రత్తలు తప్పనిసరి

రాజుపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పాత మట్టి మిద్దెలు కూలే అవకాశం ఉందని, అందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ వెంకటరమణ సూచించారు. ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు చేతులతో విద్యుత్ పరికరాలు తగలడం ప్రమాదకరమని, ఒట్టి బట్ట, కట్టె పుల్లల సాయంతో విద్యుత్ పరికరాలు తాకాలన్నారు. వంకలు, వాగులు ఉధృతమయ్యే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ఎడతెరపి లేని వర్షం

● పలు ప్రాంతాల్లో నిలిచిన వర్షపునీరు ● చిత్తడిగా మారిన రోడ్లు ● కంట్రోల్ రూములు ఏర్పాటు


చాపాడు మండలం రాజుపాళెం వద్ద నీటిలో మునిగిన వేరుశనగ

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో రెండు రోజుల నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. రాత్రి నుంచి ఈశాన్య రుతుపవనాల అల్పపీడన వర్షం, చిరుజల్లులు అప్పుడప్పుడు ఓ మోస్తారుగా వర్షం కురుస్తోంది. దీంతో జమ్మలమడుగులోని చుట్టుపక్కల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. రోడ్లు చిత్తగా మారాయి. ప్రజలు ఉదయం నుంచి బయటకు వెళ్లాలన్నా ఇబ్బందికరంగా మారింది. ప్రధాన రోడ్లు వర్షపు నీటితో నిండుకున్నాయి. అలాగే పాఠశాలల మైదానాలు వర్షపు నీటితో నిండాయి.

కాగా వర్షం కారణంగా జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రెండు కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు ఏవో ఇక్బాల్‌బాష తెలిపారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో వర్షం కారణంగా ఇబ్బందులు తలెత్తినా అందుకు సంబంధించి రెండు కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా చిరుజల్లులు కురిశాయి.

**పోరుమామిళ్ల:** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షంతో మండలంలో వరి పైరు నీట మునగగా వంకలు, వాగులు జోరుగా పారడంతో గ్రామీణ ప్రాంతాల్లో జన జీవనం స్తంభించిపోయింది. మంగళ, బుధవారాల్లో పోరుమామిళ్లలో కురిసిన వర్షానికి దమ్మనపల్లె, చెన్నారెడ్డిపేట ప్రాంతాల్లో దాదాపు వంద ఎకరాలు వరి పైరు నీట మునిగి దాదాపు రూ.30 లక్షలు నష్టం వాటిల్లింది. ప్రధాన రహదారులన్నీ నీటితో నిండి నీటి కుంటలను తలపించాయి. పోరుమామిళ్లలోని స్టేట్‌బ్యాంకు సమీపంలో మోకాలిలోతు నీళ్లు రోడ్లపై పారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామస్థులు బయటకు రాలేక గ్రామంలోనే ఉండి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో జనజీవనం స్తంభించింది. అధికారులు మాత్రం లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

### జోరు వర్షం

మండలంలో గత మూడురోజుల నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తూనే ఉంది. మండలంలో పూర్తిగా జనజీవనం స్తంభించింది. పశువులు, మేకలు, గొర్రెల రైతులు మేత కోసం తీవ్ర ఇబ్బందులు పడుతూ తోలుకుని వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. మంగళవారం రాత్రి విజయనగరకాలనీకి చెందిన చింతా శ్రీనివాసులు, లక్షుమ్మ దంపతులకు చెందిన ఇల్లు పైకప్పు కూలిపడింది. కుటుంబ సభ్యులు వరండాలో రేకుల కింద నిద్రిస్తుండగా ఇల్లు పైకప్పు ఒక్కసారిగా కూలిపడిందని, అందులో ఉన్న వంట సామగ్రి, బట్టలు, ధాన్యం పాడైపోయాయని వారు తెలుపుతున్నారు.

**బి.కోడూరు:** మండల పరిధిలోని నల్లవాగుపల్లె గ్రామ చెరువుకు బుధవారం గండి పడింది. గత నాలుగురోజుల నుంచి భారీగా కురుస్తున్న వర్షాల ధాటికి అధికంగా వర్షం నీరు వచ్చి చెరువుకు చేరుతున్నాయి. దీంతో చెరువుకు గండి పడి చెరువు కింద పొలాలపై సగిలేటికి నీళ్లు వెళుతున్నాయి. దీంతో అప్రమత్తమైన మున్నెల్లి నీటి సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆ గ్రామస్థుల సహకారంతో గండిని పూడ్చివేయడంతో చెరువుకు పెద్ద ప్రమాదం తప్పింది. లేనిపక్షంలో చెరువు పూర్తిగా తెగిపోయేదని వారంటున్నారు.

**కాశినాయన:** మండలంలో బుధవారం 28.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో నాగేశ్వర్‌రావు తెలిపారు. గత రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించి పోయింది. మూగ జీవాలైన గొర్రెలు, బర్రెలు మేతలకు కూడా తోలుకపోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే గత కొన్ని రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు పొలాలు ఆరక సేద్యాలు పడక మొక్కజొన్న సాగు చేసే రైతులు ఇబ్బందులు పడుచుండిరి. ఈ రెండు మూడు రోజుల వర్షాలకు పొలాలు తడిసి ముద్దయ్యాయి. దీంతో సకాలంలో సేద్యాలు పడి రబీలో హైబ్రిడ్ సజ్జ సాగుకైనా అందుబాటులోకి వస్తాయే రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**దువ్వూరు:** ఉల్లి, మినుము, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. వర్షాలు వీరిపాలిట శాపంగా మారాయి. మూడు రోజులుగా పడుతున్న వానలు సాగు చేసిన పంటలను దెబ్బతీస్తున్నాయి. అంతకు మునుపు సైతం అడపా దడపా తెరపిస్తూ వర్షాల పరంపర కొనసాగుతోనే ఉంది. బుధవారంతో పాటు రెండు రోజులుగా పడుతున్న వర్షం పొలం నుండి తీసిన ఉల్లిని, సాగులో ఉన్న ఇతర పైర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రాబోయే తుఫాను తలచుకుని అన్నదాతలు బెంబేలెత్తుతున్నారు.

● మండలంలో పెద్దబళ్లారి రకం ఉల్లిని వదిలేసి కొందరు, పంట తీసి పొలంలో అలాగే ఉంచి మరికొందరు రైతులు డీలాపడుతున్నారు. ఆశ చంపుకోలేక ధర కోసం పంట తీయకుండా ఇంకొందరు నిరీక్షిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో సాగైన పంటలను కోలుకోలేని దెబ్బతీస్తోంది.

### దెబ్బతిన్న గ్రామీణ రోడ్లు

పడ్డ వర్షాల తోటి గ్రామీణ రోడ్లు పాడవుతున్నాయి. మండలంలోని రామాపురం మీదుగా గొల్లపల్లె, చల్లబసాయిపల్లె వెల్లే దారి పాడై వర్షపునీరు నిలబడి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోంది. చిన్నసింగనపల్లె, పెద్దసింగనపల్లె, మదిరేపల్లె, నీలాపురం, సుగాలితాండాకు వెళ్లే రోడ్లు ఈ వర్షంతో దెబ్బతిన్నాయి.

### నీట మునిగిన వేరుశనగ

మండలంలో బుధవారం 27.02 మి.మి. వర్షం కురిసింది. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వెదురూరు, నరహరిపురం, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో సాగు చేసిన వేరుశనగ పంట సుమారు అయిదు వేల ఎకరాల్లో నీటిలో మునిగినట్లు రైతులు తెలిపారు.

**ఖాజీపేట:** మండల పరిధిలో ప్రస్తుతానికి 25 ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని వ్యవసాయ శాఖాధికారి నాగఅర్జున అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు త్రిపురవరం, చెముళ్లపల్లె, చెన్నముక్కపల్లె పంచాయతీల్లో 27 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని, వర్షం ఇలాగే కొనసాగితే మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా పంట దెబ్బతిన్నట్లు తెలిస్తే రైతులు మా దృష్టికి తేవాలని అన్నారు.






జమ్మలమడుగులో ప్రధాన రోడ్డులో ఆగిన వర్షపునీరు, బీకోడూరులో వర్షం ధాటికి ఇంటి పైకప్పు కూలిన దృశ్యం, ఖాజీపేటలో దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు, బీకోడూరులో నల్లవాగుపల్లె చెరువుకు గండి పడి వెళుతున్న వర్షపు నీరు

## హాస్టలు విద్యార్థులకు వైద్య పరీక్షలు

పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పోరుమామిళ్లలోని ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులకు అన్ని రకాల వ్యాధుల స్ర్కీనింగ్, చికిత్స నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసరు ప్రవీణ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య విద్యపై మార్గదర్శక సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజరు నవీన్‌కుమార్, డాక్టర్ వాసంతి, డీఈఐసీ బృందంలోని దంత వైద్యులు, కంటి వైద్యులు, చర్మవ్యాధుల నిపుణులు పాల్గొన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో కూడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్టీ హాస్టలు ప్రిన్సిపల్ శామ్యూల్, డిప్యూటీ హెల్త్ ఆఫీసరు సాదు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ నాగమల్లేశ్వరి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చాలి: చేతివృత్తిదారులు

బద్వేలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రజక, నాయిబ్రాహ్మణ, వడ్డెర, కల్లుగీత తదితర కులాల చేతివృత్తుల వారికి మార్కెట్ సౌకర్యం కల్పించాలని, ఒక్కో రంగానికి కనీసం 2వేల కోట్లు కేటాయించి వృత్తుల అభివృద్ధి, వృత్తిదారుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు, నాగార్జున, రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.







## సగిలేరు వంతెనపై రాకపోకలకు నిషేధం

అట్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమలూరు సగిలేరు వంతెనపై సోమశిల వెనుకజలాలు నీటి ప్రవాహాన్ని బుధవారం అట్లూరు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమశిల వెనకజలాల నీటిమట్టం పెరగడంతో వేమలూరు వంతెన ఇరువైపుల గ్రామాల వారు ప్రమాదాలకు గురికాకుండా రాకపోకలకు నిషేధించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దారు తెలిపారు. వేమలూరు వంతెనకు తూర్పువైపున ఉన్న 28 గ్రామాల ప్రజలు నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు ప్రయాణించక తప్పదు. కాగా సగిలేరు వంతెన వైపు రాకపోకలు నిషేధించడంతో బద్వేలు మీదుగా అట్లూరుకు చేరుకోవాలంటే 55 కి.మీ ప్రయాణించక తప్పదని ఆయా గ్రామల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా హైలెవల్ వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఓటు నమోదుపై గ్రామసభ

బద్వేలురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుట్టాయపల్లె గ్రామంలోని పోలింగ్‌బూత్ నెం.186లో ఓటు నమోదుపై బుధవారం తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు గ్రామసభ నిర్వహించారు. సదరు బూత్‌లో కొందరు అక్రమంగా ఓట్లు నమోదు చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ అర్జీలు రావడంతో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యంతరాలు తెలిపిన వారు, ఓటు నమోదు చేయించుకున్న వారు అభ్యంతరాలు పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఓటు నమోదుపై అభ్యంతరాలుంటే తమ దృష్టికి తెస్తే విచారణ చేపడతామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బది పాల్గొన్నారు.

## ఘనంగా గోవర్ధన పూజ


పుష్పాలంకరణలో శ్రీకృష్ణ బలరాములు

ప్రొద్దుటూరుటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొర్రపాడు రోడ్డులోని త్రీటౌన్ పోలీసుస్టేషన్ వద్ద ఇస్కాన్ కేంద్రంలో బుధవారం గోవర్ధనగిరి పూజ, శ్రీకృష్ణుణి గోవర్ధన లీల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున మంగళహారతి, మంత్రజపం, గురుపూజ, గోవర్ధన లీలాశ్రవణం, హరినామ సంకీర్తన, శ్రీకృష్ణ, బలరామ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గోవర్ధన పర్వతం సెట్టింగ్ భక్తులను ఆకట్టుకుంది. భక్తులు గోవర్ధనగిరి చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఇస్కాన్ నిర్వాహకులు శ్రీకృష్ణుని లీలలను, భగవద్గీత ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు.

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరుటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని లక్ష్మీనరసింహాపురంలో ఉన్న పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి పర్వదినం సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, పూజ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలు, వెండి కవచాలు, రంగురంగుల పూలమాలలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.

## నూతన పాలకవర్గం ఎన్నిక

బద్వేలుటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాక్రిష్ణ, సహాయ ఎన్నికల అధికారి ఎన్.నగేష్, జిల్లా కార్యవర్గం సమక్షంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎద్దుల రామసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కత్తి బ్రహ్మయ్య, కోశాధికారిగా గంగన్న, గౌరవసలహాదారుగా పుల్లంరాజు, ఎస్ ధనుంజయరావు, అసోషియేషన్ ప్రెసిడెంట్‌గా గంజికుంట పుల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సింగసాని విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా చెప్పలి వెంకటేశ్వర్లు, ఆనందరావు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని బద్వేలు యూనిట్‌వారు ఘనంగా సత్కరించారు.

## హ్యాండ్‌బాల్ పోటీల్లో వనిపెంట విద్యార్థుల ప్రతిభ

మైదుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలిలో ఈ నెల 19న జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో మైదుకూరు మండలం వనిపెంట వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం కైవసం చేసుకొన్నారు. కావలి డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వనిపెంట గురుకులం విద్యార్థులు హిమబిందు, దివ్య, స్నేహ, అమీరూన్, కుసుమ, అపూర్వలు వివిధ జిల్లాలతో తలపడి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. కాగా విద్యార్థులను, పీఈటీ శైలజలను పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల అభినందించారు.

## బొగ్గు తరలిస్తున్న లారీలో మంటలు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేళ్ల సమీపంలో బొగ్గుతో తరలి వెళుతున్న లారీలో మంటలు వ్యాపించాయి. మొదట క్యాబిన్‌లో మంటలు రావడంతో డ్రైవర్ చంద్ర ఫైర్ ఆఫీస్‌కు ఫోన్ చేసి తెలిపారని ఎస్‌ఐ వినోద్‌కుమార్ చెప్పారు. ఫైర్ వాహనం వచ్చి ప్రమాదం నివారించే ప్రయత్నం చేసినా అప్పటికే లారీ సుమారుగా దగ్ధమైందని పేర్కొన్నారు. సదరు లారీ కృష్ణపట్నం పోర్టు నుంచి మంత్రాలయానికి వెళుతుండగా మార్గమధ్యంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుందని వివరించారు.

## ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా నారాయణరెడ్డి

● 10 మంది పాలకమండలి సభ్యులుగా నియామకం



ప్రొద్దుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున గల అగస్త్యేశ్వర ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా టీడీపీ నాయకుడు కాంట్రాక్టర్ వంగల నారాయణరెడ్డిని నియమించారు. ఆ మేరకు బుధవారం రెవెన్యూ (ఎండోమెంట్స్- 11) డిపార్ట్‌మెంట్ జీవోఆర్‌టీ నెంబరు 1287ను ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ విడుదల చేశారు. ఈ ట్రస్టు బోర్డులో వంగల నారాయణరెడ్డి చైర్మన్‌గా, అవ్వారు చిన్న వెంకటరమణ, మడుగు లక్ష్మీదేవి, వి.సుభాషిణి, బి.మాధవి, కట్టమీది జయవర్ధన్‌రెడ్డి, పాలకాట్ శంకర్‌కుమార్, సోమా తిరుమలనాథ్, వుట్టి వెంకటలక్ష్మీ, దేవరశెట్టి శివనాగళ్ల, నాగవిక్రాంత్, కేశపల్లి కాంతమ్మలను బోర్డు మెంబర్లుగా ఎంపికయ్యారు. టి.మహేశ్వరశర్మ ఆలయ ప్రధాన అర్చకుడు ట్రస్టు బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వుంటారు. కాగా వీరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## ధ్వజస్తంభంపై ఆకాశదీపం


ఆకాశదీపం ఎగురవేస్తున్న దృశ్యం

రాజుపాలెం, అక్టోబరు 22 ఆంధ్రజ్యోతి): త్రేతాయుగం నాటి చరిత్ర కలిగిన చెన్నకేశవస్వామి, సంజీవరాయస్వామి ఆలయ ఆవరణంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం కార్తీక మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభంపై తాడు సాయంతో ఆకాశదీపం వేలాడదీశారు. ఈ ఆకాశదీపం శివకేశవుల తేజస్సు జగత్తుకు అందిస్తుందని భక్తుల నమ్మకం. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గంగిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

● అసాంఘిక నేరాలను కట్టడి చేయాలని వినతి


ఎస్పీ విశ్వనాథ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కలిశారు. బుధవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నూతనంగా జిల్లాకు వచ్చిన ఎస్పీ విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీకార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో శాంతి భద్రతల గురించి ఆయన చర్చించారు. అసాంఘిక నేరాలను కట్టడి చేయాలని ఎస్పీని కోరారు. అందుకు ఎస్పీ తప్పనిసరిగా ప్రొద్దుటూరుపై ప్రత్యేక నిఘా వుంచి అసాంఘిక నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## బాలికలకు భద్రత కల్పిస్తాం: ఎస్‌ఐ

చాపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలకు రౌడీల నుంచి, వేదించే ఆకతాయిల నుంచి భద్రత కల్పిస్తామని ఎస్‌ఐ చిన్నపెద్దయ్య అన్నారు. చాపాడులోని కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం బాలికల భద్రతపై అవగాహన సమావేశం జరిగింది. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా మిమ్మల్ని వేదిస్తే తన దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాలికల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాలికలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఏదైనా ప్రమాదం ఉంటే పోలీసులకు తెలియజేస్తే వెంటనే వారి వద్దకుపోయి సహాయం చేస్తామన్నారు. పోలీసుల అమరవీరుల గురించి ఆయన వివరించారు.

## ఉద్యోగులకు అన్యాయం చేయొద్దు: ఎస్టీయూ

మైదుకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యల పేరుతో ఉద్యోగులకు అన్యాయం చేయడం తగదని ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా అభిప్రాయపడ్డారు. మైదుకూరు ఎస్టీయూ రీజియన్ కన్వీనర్ వెంకటేశ్వరరాజు అధ్యక్షతన జరిగిన ప్రాంతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యల పేరుతో అన్యాయం చేస్తుందని, కేవలం ఒక్క పెండింగ్ డీఏని మాత్రమే ఇచ్చి కంటినీరు తుడిచినట్లు నిరాశ పెట్టారని, సమస్యల తీర్చడంలో శీతకన్ను వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు, అవార్డు గ్రహీతలకు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాలకొండయ్య, రామమోహన్, వైవీ సుబ్బయ్య, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.